క్లుప్తంగా

పాఠశాలలో ఆర్డీఓ తనిఖీలు



పాలతోడు పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ అఖిల

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం పాలతోడు ఎస్సీపేటలో ప్రభుత్వ పాఠశాలను రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల గురువారం తనిఖీ చేశారు. తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, ఎంఈఓ నాయుడు రామచంద్రరావులతో కలిసి పాఠశాల పరిస్థితిని పరిశీలించారు. పాఠశాల శిథిల స్థితికి చేరడం, వర్షానికి సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో ఆర్డీఓ పర్యటన ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. పాఠశాల విద్యార్థులను మరో పాఠశాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు పిల్లా తాతాలు, సరాకుల అబ్బులు, తాతపూడి లాజరు, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



మండపేటలో ఏడిద గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన 21 మందికి గురువారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మండపేట తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రామచంద్రపురం ఆర్డీఓ డి.అఖిల చేతులు మీదుగా పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం ఆనందాన్ని కలిగించిందన్నారు. నియోజకవర్గంలో సుమారు ఐదు వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసే అవకాశం ఉందని తెలిపారు. అందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని ఆర్డీఓ అలేఖ్యను ఆదేశించారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలంటూ ఇప్పటికే విజయవాడలో మంత్రివర్గ సబ్ కమిటీకి వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, నాయకులు రామిశెట్టి రాజా, పర్వతినేని వీర్రాజు, తహసీల్దార్ తేజేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ మెహర్ బాబా, ఆర్ఐ వాసంతి, ఏడిద వీఆర్ఓలు దుర్గారావు, వెంకటేశ్వరరావు, నరేష్, పద్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి శంకుస్థాపన



ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం జెడ్.మేడపాడులో శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామిఆలయ పునర్నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సాగుతో మంచి ఫలితాలు



మారేడుబాకలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ ప్రభాకరరావు

కపిలేశ్వరపురం (మండపేట): శాస్త్రీయ పద్ధతిలో సాగు చేయడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.ప్రభాకర్ అన్నారు. మండపేట మండలం మారేడుబాకలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. విత్తన శుద్ధి ప్రాధాన్యత, మిత్ర పురుగులు సంరక్షణ, శత్రు పురుగుల గుర్తింపు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పూర్తి వివరాలను ఆర్ఎస్‌కేలలో అందజేసి పంటల బీమా పథకంలో నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో నీటి సంఘం డైరెక్టర్ ముత్యాల సత్యనారాయణ, రాయుడు గంగరాజు, వ్యవసాయ విస్తరణాధికారి బాలకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ బాజీ, రైతులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి సఖినేటిపల్లి మండలం మోరి గ్రామానికి చెందిన ఉప్పుగంటి సత్యనారాయణ, నాగమణి దంపతులు గురువారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

చూడితోనే.. పాడి

- పశువుల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి
- ఎదను సకాలంలో గుర్తించడం ముఖ్యం
- నిర్లక్ష్యం చేయకూడదంటున్న వైద్యులు



మేడిశెట్టి కృష్ణార్జున



గేదెకు చూడి పరీక్ష చేస్తున్న పశు వైద్యురాలు

రామచంద్రపురం రూరల్: పాడి పరిశ్రమలో విజయం సాధించాలంటే చక్కటి యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున సూచిస్తున్నారు. కృత్రిమ గర్భాధారణ చేసిన 60 రోజులకు తప్పనిసరిగా చూడి పరీక్ష చేయించాలని, కట్టుకు రానంత మాత్రాన పశువు చూడిదని పరీక్ష చేయించడంపై నిర్లక్ష్యం చేయకూడదంటున్నారు. చూడి పరీక్ష, పశువుల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

ఈనడానికి ముందు

చూడి పశువులను ఎక్కువ దూరం నడిపించకూడదు, పరిగెత్తించకూడదు. ఎత్తు ప్రదేశాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. 3 నుంచి 6 నెలల్లో నట్టల నివారణ మందులు తాగించాలి. చూడి పశువు పొదుగును ఈనటానికి నెల ముందు నుంచి మర్దనా చేయాలి. దీని వల్ల పొదుగు బాగా పెరుగుతుంది. ఈనడానికి 45–60 రోజుల ముందు పాలు పితకకుండా వదిలేయాలి. ఇలా చేయడం వల్ల పొదుగులోని పూర్వ కణజాలం నశించి, కొత్త కణజాలం ఏర్పడుతుంది. ఈనిన తర్వాత పాల ఉత్పత్తి పెరుగుతుంది. పశువు నిండు చూలుతో ఉన్నప్పుడు మేతకు బయటకు వదలకూడదు. చూడితో ఉన్న పశువులను ఇతర పశువులు, ఆంబోతుగాని ఎక్కకుండా చూడాలి. చూడి పశువులను ఇతర పశువులతో కలపకుండా విడిగా లేక వేరే పాకలో ఉంచాలి. అక్కడ నేల జారుడుగా లేకుండా చూసుకోవాలి. బయటకు వదిలేటప్పుడు ఇరుకైన మార్గాలు లేకుండా చూడాలి.

ఈనే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నెలలు నిండిన పశువు సరిగ్గా ఏ రోజు ఏ సమయంలో ఈనుతుందో ముందుగా చెప్పలేం. కానీ, సాధారణంగా పశువులు రాత్రివేళ లేదా తెల్లవారుజామున ఈనడం గమనించవచ్చు. బహుశా ఆ సమయంలో ప్రశాంతంగా తక్కువ అలజడి, ఒత్తిడి ఉండటం వల్ల కావచ్చు. ఈనే లక్షణాలు కన్పించిన వెంటనే పశువును వేరే పాకలో శుభ్రమైన పాడిగడ్డితో పక్కవేసి ఉంచాలి. రాత్రి వేళలో తరుచూ గమనిస్తుండాలి. సాధారణంగా పశువులు ఎలాంటి సాయం లేకుండా ఈనతాయి. కానీ, కనిపెట్టుకుని ఉండటం వల్ల ఒక్కోసారి దూడ అడ్డం పడినప్పుడు లేక వెనుక కాళ్లు వచ్చినప్పుడు వెంటనే పశు వైద్యుల సాయం తీసుకొంటే దూడకు, తల్లికి ప్రాణాపాయం లేకుండా చూడగలుగుతాం. నొప్పులు మొదలైన 2 గంటల్లోగా ఈనుతుంది. అదే తొలిచూలు బిడ్డ అయితే ఎక్కువ సమయం పడుతుంది. ఈన లేక పోతే డాక్టర్‌ను సంప్రదించాలి. అంతేగానీ దూడను లాగటానికి ప్రయత్నించకూడదు. ముందర కాళ్లు, తల బయటకు వస్తే ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఈనిన వెంటనే దూడకు తల్లి దగ్గర జున్ను పాలు తాగించాలి. దీనివల్ల ఆక్సిటోసిన్ హార్మోన్ ఉత్పత్తి అయి మాయ సకాలంలో వేస్తుంది. ఈనిన 24 గంటల్లోగా మాయ వేయకుంటే పశువైద్యుల సాయం తీసుకోవాలి. ఈనిన తర్వాత మంచి పాడి సార కలిగిన పశువులకు పాలజ్వరం రాకుండా కాల్షియం ఇంజెక్షన్లు వేయించాలి.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో మండలాల వారీగా పశు సంపద వివరాలు

మండలం	ఆవులు	గేదెలు
రామచంద్రపురం	2,159	7,288
కె.గంగవరం	4,289	8,846
కాజులూరు	4,830	8,332
మండపేట	5,842	7,560
రాయవరం	3,980	5,230
కపిలేశ్వరపురం	3,510	4,870

సమృద్ధిగా మేపు

చూడి పశువులకు సమృద్ధిగా పచ్చి మేత వేయాలి. చూడి దశలో పశువుకు దాని శరీర పోషణతో పాటు గర్భంలోని పిండం అభివృద్ధికి కూడా పోషక పదార్థాలు అవసరం. ఈ దశలో అదనంగా మేత, దాణా ఇవ్వాల్సి ఉంటుంది. చివరి రెండు మాసాల చూడిలో పశువుకు కిలో దాణా, 30 గ్రాముల ఖనిజ లవణ మిశ్రమం అదనంగా ఇవ్వాలి.

ఈనబోవు లక్షణాలు

నెలలు నిండిన పశువు చిన్నగా నడుస్తుంది. పొదుగు బాగా పెరుగుతుంది. తొలిచూలు పశువులో పొదుగు 4 నెలల నుంచి పెరగడం ప్రారంభమవుతుంది. ఈనడానికి రెండు వారాల ముందు మాత్రమే పొదుగు పెరుగుతుంది. తొలిచూలు పశువులో 4వ నెల నుంచే చన్నుల నుంచి పిండినప్పుడు జిగురుగా తీగ వంటి ద్రవం గమనించవచ్చు. పశువు ఈనే ముందర పసుపు పచ్చని ముర్రుపాలుగా మారుతుంది. పశువు ఈనటానికి కొద్ది రోజుల ముందర నీరుడు పెరుగుతుంది. ఇతర పశువులతో కలవకుండా ప్రశాంతమైన ప్రదేశాన్ని కోరుకుంటుంది. మేత తీసుకోవడం మందగిస్తుంది. శరీర ఉష్ణోగ్రత 1 నుంచి 2 డిగ్రీల ఫారన్ హీట్ పెరుగుతుంది. హార్మోన్ల ప్రభావం వల్ల గర్భ ద్వారం మెత్తబడి తెరుచుకొనుట మొదలవుతుంది.

తెగుళ్ల నివారణపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: పంట తెగుళ్లపై రైతులు తొలిదశ నుంచి తగిన శ్రద్ధవహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మండలంలోని తిప్పరాజుపాలెం, చేదువాడ, కాజులూరు తదితర గ్రామాల్లో గురువారం ఏఓ అశోక్ పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తిప్పరాజుపాలెంలో ఆయన మాట్లాడుతూ వరిసాగులో పంట తొలి దశ నుంచే మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రత, మధ్య మధ్యలో చెదురు మదురు వర్షాలు కారణంగా వరి పంట పలు రకాల వ్యాధులు, తెగుళ్ల బారిన పడుతుందన్నారు. మండల గ్రామాల్లోని పంటపై అక్కడక్కడా బ్యాక్టీరియా ఎండాకు తెగులు, పొడతెగులు, లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. రైతులు రైతుసేవాకేంద్రాలలో వ్యవసాయశాఖ సిబ్బంది సూచనల మేరకూ తగిన సమయంలో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. తెగుళ్ల లక్షణాలు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి



ఆన్‌లైన్‌లో క్విజ్‌పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు

రామచంద్రపురం: ప్రతి విద్యార్థి జాతీయ వాదాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల డాక్టర్ సీహెచ్ రామకృష్ణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆన్లైన్లో జాతీయస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయస్థాయి క్విజ్ పోటీలను తెలుగు హిందీ ఇంగ్లీష్ విభాగాలు తరపున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. పద్మజ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ శ్రీనివాస్, డాక్టర్ రమణ, డాక్టర్ ఎస్ లక్ష్మి, డాక్టర్ .ఎస్. సుజాత, శ్రీమతి శ్రీదేవి ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై దృష్టి సారించాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

కె.గంగవరం: ప్రతి రైతు ప్రకృతి ద్వారా లభించే ద్రవ జీవామృతాలు ఉపయోగించి వరిసాగు చేయాలని ఏఓ సద్గురు మూర్తి సూచించారు. కుందూరులో గురువారం రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరిసాగు చేస్తే ఆరోగ్యమైన పంట పండించడంతో పాటు పెట్టుబడికూడా తగ్గి అటు రైతులకు, ఇటు ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. దీని కోసమే రైతులకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. మండల మాస్టర్ ట్రైనర్ బాబూరావు మాట్లాడుతూ ద్రవ జీవామృతం తయారీ ద్వారా భూమికి సాయంతో పాటు చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. అన్నదాత సుఖీభవ లబ్ధి పొందన రైతులు ఈ నెల 20 తేదిలోపు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సూచించారు. సొసైటీ చైర్మన్ జగతా రమణ, వీఏఏ రేవతి, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోతుల సంచారాన్ని నిరోధించాలి



శీల గ్రామ వీధుల్లో సంచరిస్తున్న కోతులు

కాజులూరు: శీల గ్రామంలో ఇటీవల కోతులు గుంపులుగా సంచరిస్తూ రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. గ్రామ వీధుల్లో హల్‌చల్ చేస్తూ స్థానికులు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కొబ్బరి చెట్ల నుంచి కాయలు, పిందెలను తుంచి కింద పడేస్తున్నాయి. పంట పొలాలపైనా కోతులు దాడి చేసి చిరుపొట్ట దశలో ఉన్న వరి మొక్కలను తుంచి పొట్టతినివేస్తున్నాయి. దీంతో తమకు నష్టం వాటిల్లుతుందని రైతు లు వాపోతున్నారు. గ్రామ వీధిల్లో సంచరిస్తు ఇళ్లపై పరుగులు తీస్తుండటంతో తాటాకు ఇల్లు, పెంకుటిల్లుల పైకప్పులు జారిపడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు మహిళలు, ఇంటిలో నుంచి బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులపై కోతులు దాడి చేస్తాయని వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. తాళ్లరేవు అభయారణ్యం దగ్గర కావడంతో అక్కడి నుంచి కోతుల గుంపులు గ్రామానికి చేరుతున్నాయన్నారు. అధికారులు స్పందించి కోతుల సంచారాలను నిరోధించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

చినుకు పడితే చెరువే..



చిన్నపాటి చినుకులకు చెరువుగా మారిన ఊడిమూడి-సుందరపల్లి రహదారి

కె.గంగవరం: చిన్నపాటి చినుకులకే రోడ్డు జలమై పోతుందని ఊడిమూడి గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని ఊడిమూడి నుంచి సుందరపల్లి వెళ్లే ప్రధాన రహదారి ఊడిమూడి వద్ద వర్షం కురిస్తే వర్షపు నీరు చేరి రోడ్డు మొత్తం నీటితో నిండిపోతోంది. గత ఏడాది కాలంగా సమస్యను ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. రోడ్డు మొత్తం నీటితో నిండిపోవడం వల్ల ఎక్కడ గొయ్యి ఉందో తెలియక అటు వాహనదారులు, ఇటు కాలినడకన వెళ్లే ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షం కురిసిన రెండు రోజుల వరకు నీరు రోడ్డుపై నుంచి వెళ్లకుండా ఉండిపోతుందని తద్వారా దోమలు పెరిగి అనారోగ్యపాలవుతున్నామని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు ఎత్తు పెంచడంతో పాటు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు.

రామచంద్రపురం జెడ్పీటీసీ వెంకటేశ్వరరావు మృతి



వెంకటేశ్వరరావు(ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండల జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు(59) బుధవారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన గతంలో రామచంద్రపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా, ద్రాక్షారామ వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఆయనకు భార్య విజయ, కుమారుడు సాయిరామ్ ఉన్నారు. ఆయన భౌతిక కాయాన్ని గురువారం మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, రెడ్నం సతీష్, సర్పంచ్ అంబటి తుకారం, ద్రాక్షారామ ఏపీసీఎస్ చైర్మన్ ముప్పనపల్లి గణేష్, గ్రామ పెద్దలు మేర్నీడి మూర్తి, మేర్నీడి శ్రీను, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ నాయకులు కోట వాసుదేవ, కోట శ్రీనివాసరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సందర్శించి నివాళులు అర్పించారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

కృష్ణాష్టమి వేడుకలకు సర్వం సిద్ధం

- రేపు శ్రీకృష్ణ జన్మాష్టమి
- ముస్తాబైన ఆలయాలు



శ్రీకృష్ణభగవానుడు

రాయవరం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సర్వం సిద్ధమైంది. శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని తరించేందుకు ఆబాలగోపాలం సన్నద్ధమవుతున్నారు.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటుగా మండపేట, కె.గంగవరం, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం రూరల్, కాజులూరు మండలాల పరిధిలోని 90 గ్రామాల్లో వైష్ణవ ఆలయాలు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించనున్నారు. క్లస్టర్ పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గీతా మందిరాలు కృష్ణతత్వాన్ని బోధిస్తున్నాయి. పర్వదినాలతో పాటు పలు ప్రత్యేక సందర్భాల్లో చిన్నారులకు గీతాపారాయణం చేస్తున్నారు. గీత ద్వారా కృష్ణుడు సమాజానికి బోధించిన ఆధ్యాత్మిక చింతన, కృష్ణుడి ప్రేమతత్వాన్ని చిన్నారులకు బోధిస్తున్నారు. అలాగే చిన్నారులకు నీతి కథలను బోధిస్తూ ఆధ్యాత్మిక చింతన, సత్ప్రవర్తన గల పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు.

ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు : గ్రామాల్లోని వైష్ణవ ఆలయాలు శ్రీకృష్ణాష్టమి వేడులకు ముస్తాబవుతున్నాయి. పలు వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, జ్వాలా తోరణాలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. వెదురుపాక విజయదుర్గా పీఠంతో పాటు క్లస్టర్ పరిధిలో ఉన్న పలు గీతామందిరాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. గీతా మందిరాల్లో 24 గంటల పాటు గీతా పారాయణం చేపట్టనున్నారు.

కృష్ణతత్వాన్ని అర్థం చేసుకుంటే జన్మకు సార్థకత



ఓం శాంతి ఆశ్రమంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నాం. కృష్ణతత్వాన్ని అర్థం చేసుకుంటే మానవ జన్మకు సార్థకత చేకూరుతుంది.

బ్రహ్మకుమారి మాధవి, ఓం శాంతి ఆశ్రమం, పసలపూడి, రాయవరం మండలం

యువతకు స్ఫూర్తిదాయకం



శ్రీకృష్ణుడి బోధనలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం. శ్రీకృష్ణతత్వాన్ని పెంపొందించేందుకే తొమ్మిది రోజుల పాటు మాలధారణ చేశాను. గీతామందిరం ఆధ్వర్యంలో గీతాయజ్ఞం నిర్వహిస్తున్నాం.

– పడాల శివమణికంఠరెడ్డి, గీతామందిరం సభ్యుడు, వెదురుపాక, రాయవరం మండలం.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లకు దరఖాస్తు

రావులపాలెం: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్ల పొందేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ బి.శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. 2025 –26 విద్యాసంవత్సరానికి విద్యార్థి ఇంటి నుంచి ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి అడ్మిషన్ కోసం ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలు అర్హులన్నారు. ఏప్రిల్, 2, 2019 నుంచి మార్చి, 31, 2020 మధ్య జన్మించిన విద్యార్థులు ఈ అవకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈనెల 20 తేదీ వరకు సీఎస్‌సీ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద దీనికి సంబంధించిన బ్యానర్‌ను ఎంఈఓ విడుదల చేశారు.

సొసైటీ పీఐసీ బాధ్యతల స్వీకరణ

మామిడికుదురు: అప్పనపల్లి సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ గురువారం బాధ్యతలు స్వీకరించింది. చైర్మన్‌గా కామిశెట్టి వెంకట్రావు(బాబ్జి), సభ్యులుగా పాటి గోవిందరావు, తులా ఆదినారాయణ చేత సెక్రటరీ గిడుగు శ్రీరాములు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొంతు భాస్కరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా



అంగరలో 79 ఆకారంలో నిలుచున్న విద్యార్థులు



కాజులూరులో పంట పొలాల మధ్య జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థులు



హసన్‌బాదలో 500 అడుగుల జాతీయ జెండాతో సర్పంచ్ సతీష్‌రావు తదితరులు



జాతీయ జండాతో తిరంగా యాత్ర చేస్తున్న విద్యార్థులు, బీజేపీ నాయకులు

కపిలేశ్వరపురం: స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా గురువారం అంగర శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు చేతపట్టి భారత్‌మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. విద్యార్థులు 79 ఆకారంలో నిలబడి విశేషంగా ఆకట్టుకున్నారు. కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర, చైర్మన్ డాక్టర్ వి.దివ్యశేఖర్, కరస్పాండెంట్ వాకా రాజా మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. మనదేశాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాజులూరు: సమాజంలో ప్రతీ ఒక్కరూ దేశ భక్తిని కలిగి ఉండాలని రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ కో ఆర్డినేటర్ దూడల శంకరనారాయణ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామాలలో పాఠశాల విద్యార్థులు గ్రామంలో తిరంగా ర్యాలీ నిర్వహించి పచ్చని పంటపొలాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మీడియా సెల్ కార్యదర్శి రొక్కాల సత్తిబాబు, పలువురు పార్టీ నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

500 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో ప్రధాన మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం 500 అడుగుల జాతీయ జెండాతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ శుక్రవారం తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగుర వేయాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నీల గంగాభవాని, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వాడ్రేవు వెంకటరావు, చేనేత నాయకుడు దొంతంశెట్టి సత్య ప్రకాశ్, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పీఎస్‌బీఎస్‌కే సుందరి, పంచాయతీ కార్యదర్శి సబ్బెళ్ల ప్రసాద్ రెడ్డి, వీఆర్ఓ నరహరిశెట్టి సత్తిబాబు, సచివాయ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన జాతీయ జెండా..

కె.గంగవరం: అముజూరు గ్రామంలో గురువారం జాతీయ జెండా రెపరెపలాడింది. మండల బీజేపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు ఆధ్వర్యంలో హారికా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, బీజేపీ నాయకులు కలసి గ్రామంలో ఆజాద్ కా అమృత మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. జాతీయ జండాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి భారతదేశ గొప్పతనాన్ని గ్రామస్తులకు వివరించారు. ప్రతి ఇంటి వద్ద జాతీయ పతాకం ఎగురువేయాలని వారు కోరారు. నియోజకవర్గ అసెంబ్లీ కో కన్వీనర్ సలాది శేఖర్, నాయకులు గుర్రాల సత్యనారాయణ, ఏవీ రమణమూర్తి, యువమోర్చ అధ్యక్షుడు శ్రీరామ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.